ఊరిలోనే స్పెషాలిటీ వైద్యం

- ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- ఊరూరా వైద్య శిబిరాలు

పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం పలు గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, జిల్లాస్థాయి అధికారులు వైద్య శిబిరంలో అందుతున్న సేవలను పర్యవేక్షించారు. బొండపల్లి మండలం గొట్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు సందర్శించారు. గుర్ల మండలం గరికివలస, మెరకముడిదాం మండలం గొల్లలవలస, చీపురుపల్లి మండలం మెట్టపల్లి, గరివిడి మండలం అర్తమూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు బొత్స సందీప్ పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు.

– సాక్షి నెట్‌వర్క్


గంట్యాడ: పెదమజ్జిపాలెం ... వసంత గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో రోగులకు అందజేస్తున్న మందులను పరిశీలిస్తున్న సర్పంచ్ అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ చంద్రకళ


బొండపల్లి: గొట్లాంలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


లక్కవరపుకోట: కళ్లేపల్లిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ


జామి: వీఆర్ పాలెంలో జగనన్న ఆరోగ్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి


గుర్ల: గరికివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధులకు మందులు అందజేస్తున్న ధీర ఫౌండేషన్ చైర్మన్ బొత్స సందీప్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు


మెరకముడిదాం: గొల్లలవలసలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో వృద్ధుడికి ప్రభుత్వం ఉచితంగా సరఫరాచేసిన కళ్లద్దాలను పెడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సందీప్


చీపురుపల్లి రూరల్: మెట్టపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్డులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సందీప్


వేపాడ: బానాదిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీస్తున్న సర్పంచ్ యశోద, ఎంపీడీఓ పట్నాయక్


మెంటాడ: గజపతినగరం మండలం పిడిశీలలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ పాండ్రంకి మాధవి


వేపాడ: చినదుంగాడలో జ్వరాలతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా

ఆశ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


ఆశ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న బొండపల్లి పీహెచ్‌సీ సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి దోలపేట గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సూర్యకాంతం కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసకుంటోంది. విషయం తెలుసుకున్న బొండపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది రూ.50 వేలు సేకరించి సోమవారం సూర్యకాంతం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సీహెచ్‌ఓ రాజగోపాల్, హెల్త్ సూపర్‌వైజరు ఎస్.ఎ.భాషా తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న దాతలు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురంలో ఉన్న పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన సముద్రాల రామానుజాచార్యులు తనవంతుగా రూ.5వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని శ్రీవారి సేవకుల ప్రతినిధి ఎస్ఎస్ఆర్ ఆచార్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామానుజాచార్యులు దంపతులను ఆలయ ప్రధాన అర్చకుడు, శ్రీవారి సేవకులు సత్కరించారు.

సేవలందించడంలో జాప్యం వద్దు


అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

మెంటాడ(గజపతినగరం రూరల్): సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం వహించొద్దని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సోమవారం తన ఛాంబర్‌లో సమావేశమై పలు సూచనలు చేశారు. అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. విద్యాశాఖ పనితీరు మెరుగుపడేలా చూడాలని ఎంఈఓ విమల కుమారికి సూచించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులు ఎంతవరకు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆరాతీశారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

17న ద్విచక్ర వాహనం వేలం

వేపాడ: వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని(ఏపీ 31 బీజే 6389, ఆరెంజ్ కలర్ పల్సర్) ఈ నెల 17న ఎస్.కోట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ సోమవారం తెలిపారు. రూ.10 వేల నుంచి వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని వాహనాన్ని సొంతం చేసుకోవాలని కోరారు.

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు


సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని తుమ్మి అప్పారావు వారి కల్లాల్లో గుర్తించిన సిరిమాను చెట్టును సోమవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

తీరప్రాంతంలో తనిఖీలు


తీరంలో బోటును తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

పూసపాటిరేగ: మండలంలోని తీరప్రాంత గ్రామాలలో భోగాపురం ఎస్ఈబీ పోలీసులు సోమవారం రాత్రి విస్తతంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి సముద్ర మార్గం గుండా సారా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఈబీ ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ


చీపురుపల్లి: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం


వేపాడ: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కాపుశంబాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు లెంక రోష్మిత, చింతా మేఘన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7న విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-19 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 22న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం డి.రాము, పీడీ ఎం.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు బూర్లె సుభద్ర, పిల్ల ఉష అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ మూర్తి, అధ్యాపకులు అభినందించారు.

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు తెలిపారు. అండర్-19 విభాగంలో కోకో పోటీకి గండి జ్యోత్స్న్నవి, కబడ్డీ పోటీకి నౌడు లౌకిక, బాలుర విభాగంలో కబడ్డీ పోటీకి మద్దిల రంజిత్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం సీసాల స్వాధీనం

కొత్తవలస: మండలంలోని పాతసుంకరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్సై పి.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన పెదిరెడ్ల గంగరాజు మద్యం అమ్ముతుండగా పట్టుకొని ఆయన వద్ద 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్పందనకు మూడు వినతులు

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మూడు వినతులు వచ్చినట్లు ఈఓపీఆర్డీ వాణిశ్రీ తెలిపారు. రెవెన్యూ సమస్యలపై, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై, జలసిరి బోరు ఏర్పాటు చేయాలని ఒక్కో వినతి అందినట్లు చెప్పారు. దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపించామని, అధికారులు వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అన్నారు.

నేడు పాచలవలసలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆరోగ్య సర్వేలో గుర్తించిన రోగులకు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. పాచలవలస, పి.లింగాలవలస, చెరుకుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

దీర్ఘకాల సమస్యకు పరిష్కారం





గుర్ల: మండలంలోని ఆనందపురం రామాలయం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారి మురుగు నీటితో నిండిపోయి అధ్వానంగా ఉండేది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి రూ.5 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో సీసీరోడ్డు, కాలువలు నిర్మించారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి సాగు సూత్రాలపై అవగాహన


మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

వేపాడ: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంలో అనుసరించే సార్వత్రిక సూత్రాలపై ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్ మహిళా సంఘాల సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యం పెంపు, పీఎండీఎస్ నవధాన్యాల సాగు, 365 రోజులు బహుళ పంటల సాగు విధానం, పెరటి తోటల పెంపకం, తదితర అంశాలను వివరించారు. మహిళా సంఘాల సభ్యులు గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. అనంతరం చీడపీడల నివారణకు వినియోగించే కషాయాల తయారీపై వారికి శిక్షణ ఇచ్చారు.

విప్లవ యోధుడు చేగువేరా


చేగువేరాకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపేందుకు వైద్య వృత్తిని వదిలిపెట్టి ఉద్యమబాట పట్టిన యోధుడు చేగువేరా అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సీహెచ్ కేశవరావు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చేగువేరా వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా అధ్యాపకులు, విద్యార్థులు చేగువేరా చిత్రపటం వద్ద పుష్పాలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ.. అర్జెంటీనాలో పుట్టిపెరిగిన చేగువేరా వైద్యవృత్తి వదిలిపెట్టి, సామ్యవాద భావజాలంతో సమాజంలో ఉన్న అంతరాలను తరిమేయాలని పోరుబాట పట్టాడని అన్నారు. 1951లో ఆయన చేపట్టిన మోటార్‌సైకిల్ యాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు మాట్లాడుతూ చెగువేరా గాటిమాల, క్యూబా విప్లవాలలో కీలకభూమిక పోషించారన్నారు. ఫెడ్రల్‌క్యాస్ట్రో ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ బాధ్యతలు చేపట్టి సమాజాన్ని విజయపథంలో నడిపిన మేధావిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.ఈరన్న, షేక్ వలీఖాన్, డా. వి.సుధీర్, ఆర్.శ్రీలక్ష్మి, స్వామినాయుడు, పి.భాస్కరరావు, సురేష్, ప్రసాద్, అప్పలరాజు, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు


కాలంరాజుపేటలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగిస్తున్న సిబ్బంది

గజపతినగరం: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫారంల నిర్వహణ, స్తంభాల మార్పిడి తదితర పనులపై సిబ్బంది దృష్టి సారించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మండలంలోని మరుపల్లి, రంగుపురం, కాలంరాజుపేట, ఎం.కొత్తవలస, ముచ్చర్ల, మదుపాడ, గుడివాడ తదితర గ్రామాల్లో రూ.25 లక్షలతో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలు, లైన్ల మార్పిడి తదితర పనులు చేపట్టారు. విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ


బొండపల్లి: పలుపత్ర ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం ఆనందరావు


లక్కవరపుకోట: ఆకులతో కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొండపల్లి: వరి పంటను ఆశించే తెగుళ్లను పలు పత్ర ద్రావణంతో సమూలంగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎం.ఆనందరావు అన్నారు. మండలంలోని వెదురువాడ పంచాయతీ పనసలుపాడు గ్రామంలో రైతులకు పలుపత్ర ద్రావణం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఔషధ గుణాలు కలిగిన 21 రకాల ఆకులను డ్రమ్ములో వేసి ఐదు రోజులు పాటు నీటిలో బాగా మరగబెట్టాలని, ఆ కషాయాన్ని వడగట్టి 1 లీటరు కషాయాన్ని 10 లీటర్ల నీటికి కలిపి వరిపంటపై పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఎం.రామకృష్ణ, ఎం.రామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై శిక్షణ

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయం విభాగాల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయ విధానంలో ఉపయోగించే కషాయాల తయారీపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు వివిధ రకాల పత్రాలతో కషాయాలను ఏవిధంగా తయారు చేసుకోవచ్చో మాస్టర్ ట్రైనర్ కోటిబాబు రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందులను పంటకు వినియోగించకుండా ప్రకృతిలో లభించే ఆకులతోనే ఈ కషాయాలను తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కషాయాల వినియోగం వల్ల భూసారం పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది జానికి, మల్లేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పవిత్రోత్సవాలకు అంకురార్పణ


పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో రామచంద్రస్వామి పవిత్రోత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం అంకురార్పణ నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలు చేపట్టి వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణం వేడుకగా జరిపించారు. సాయంత్రం ఆశీర్వచన మంటపంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా జరిపించి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. అర్చకులకు దేవస్థాన ఈఓ కిషోర్‌కుమార్ దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 11 వరకు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించి .. 12న శాంతి కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.